



## శ్రీ మొదలి వెంకట సుబ్రహ్మణ్యశర్మ

రమణరావు ఎమ్మే పరీక్ష ప్యాసవడమే కారణం అతని కాపరానికి అరిష్టం కలగడానికి.

అసలు అది మదరాసు యూనివర్సిటి. విద్యార్థుల ప్రాణాలు నిలువునా తీసి ఒకంతరాన డిగ్రీలు యివ్వని యూనివర్సిటీలో ఎమ్మే పరీక్ష ప్యాసవడమూ, అందులో ఫస్టుగా పరీక్ష ప్యాసవడమూ అంటే సామాన్యమా? అలాంటి పరిస్థితులలో రమణరావు తల తిరిగిందంటేనూ, మనస్సు మారిపోతేనూ, కళ్లు నెత్తికెక్కిన వంటేనూ, ఆశ్చర్యమా?

ప్యాసవడానికి బి. ఏ. పరీక్ష అయిన తర్వాతనే పెళ్లి అయింది. అప్పుడా పెళ్లి విషయాన్ని గురించి అతని కేమీ అభ్యంతరము కన్పడలేదు. ఎమ్మే పరీక్ష అయిన తర్వాత మాత్రం ఆపిల్ల అతని కక్కర లేకపోయింది. అప్పటికీ, యిప్పటికీ — అంటే యీరెండు ఏళ్లలోనూ ఆపిల్ల అందము తగ్గిపోయిందని ఏమీలేదు. ఉన్న అందము వయస్సు వచ్చిన కొద్దీ మెరుగెక్కిందని కూడా అందరూ అనుకొన్నారు. ఈ రెండేళ్లలోనూ కాస్తో కూస్తో ఆమె చదువు వృద్ధిచేసుకొన్నదే గాని చదువు వెనకకు పోయిందీ లేదు. ఈ రెండేళ్లలోనూ రమణరావు కుటుంబానికి అతని అత్తవారి కుటుంబానికీ ఏమీ పేచీలూ కలతలూ కూడా లేవు.

అప్పటికీ యిప్పటికీ ఒక్కపీరులాగా — నల్లగా — పొడుగాటి ముక్కు — అతనూ చూడడానికి అదో మోస్తరుగా వుంటూనే వున్నాడు. ఆ ఫేసుపౌడర్లూ ఆస్నోలూ, ఆ వాసిలయినలూ, చివరకు ఎమ్మే డిగ్రీకూడా అతని అందములో పెద్దమార్పేమీ తీసుకొనిరాలేదు. తెలివి తేటలందామా, వాటి సంగతి అతనికీ అతనికి డిగ్రీ యిచ్చిన యూనివర్సిటికీ తెలియ వలసిందేగాని యితరులకు తెలియదు.

అయితే పర్యవసానం అతను భార్యను ఒల్లదలచుకో లేదు.

సుశీలరజస్వల అయిన సంవత్సరన్నర వరకూ వియ్యాల వారు నిషేక ప్రస్తావన చేస్తారేమోనని తలిదండ్రులు చూశారు. ఎన్నాళ్లకూ ఆ ప్రస్తావన రాక పోయేసరికి సుశీల తండ్రి స్వయంగా వెళ్లి ఆ ప్రస్తావన చేశాడు. ఆలోచిస్తామని మాత్రం వాళ్లన్నారు.

ఎమ్మే పరీక్ష అయిన కొద్ది రోజులకు యిక బాగుండ దనుకొని రమణరావుతో గర్భాధానపు ప్రశంస అతని తలిదండ్రులు చేశారు. అతను తన కా పిల్ల అక్కర్లేదని నిష్కరషగా చెప్పాడు. వాళ్లు విస్తుబోయి కారణా లడిగారు. అతను "ఆపిల్ల నాకక్కరలేదు" అని తప్ప మరేమీ చెప్పలేదు. వాళ్లు కోపపడ్డారు. తమను తాము తిట్టుకొన్నారు. ఏడ్చారు — మొత్తుకొన్నారు. ప్రయోజనం మాత్రం పూజ్యం. ఈ వార్తాహారత్వము తామెంత మాత్రమూ పూనుకోమని అతని తలిదండ్రులు ఘంటా పథముగా చెప్పినారు.

రమణరావు మామగారివూరు – గుంటూరు – వెళ్లి అతని బావమరిది తరుచూ వెళ్లే టవుక్ హాలుకు వెళ్లి అతనికి కనుపించాడు. బావమరిదీ అతనూ మాట్లాడుకొంటూ వెళ్లారు.

“మాయింటికి రానేలేదే బావగారూ ?” అన్నాడు పద్మనాభ రావు.

“ఒకానొక స్నేహితుడితో పనివుండి వచ్చి వాళ్ళింటికే వెళ్లాను”

“ఈ రాత్రికయినా తమరు తప్పక దయ చెయ్యాలి”

“రాత్రికి అర్జంటుగా వెళ్లాలి. దసరా సెలవలు రేపటితో ఆఖరు. ఎల్లుండి కాలేజీకి విధిగా హాజరు కావాలి తప్పక వెళ్లాలి”

“అంత తొందరగా ఏమి అవసరం ?”

“నేను క్రిస్టియన్ కాలేజీలో లెక్కల ట్యూటరుగా ప్రవేశించాను.

“ఇంటికి వచ్చి అయినా పోగూడదూ. మా నాన్నగారేదో మీతో మాట్లాడవలె నని కొంటున్నారు.”

“విషయమేమిటో నీవు చెప్పు”

“అమ్మాయి మాటే ? మీయింటికి పంపించడము విషయము. మీతోనే మాట్లాడి మీ అభిప్రాయం ప్రకారము చేతామని”

“సరి, నీవే యెత్తావు. చెప్పడానికి నాకూ కష్టంగానే వున్నది. కాని మీ అమ్మాయిని నేను తీసుకొని వెళ్ల దలచుకోలేదు.”

పద్మనాభరావు అతనివైపు వెర్రిగా చూశాడు. రమణరావు వివరించి చెప్పాడు. పద్మనాభరావు కారణాలడిగాడు.

“కారణాని కేముందీ ? ఆమె నాకేవిధంగానూ అర్హురాలు గాదని నా అంతరాత్మ చెబుతోంది”

“ఎందువల్ల”

“మొదటి సంగతి, గుంటూరులో ఉన్నా అచ్చంగా పల్లెటూరు పిల్లలాగా పెరిగింది. తరువాత చదువూ సంధ్యా బొత్తుగా లేదు”

“అదే కారణమయితే చెప్పించుకోవచ్చు”

“ఇహ చెప్పించుకోవడమే. మొనగాళ్ల మనుకున్న వాళ్లకు చేత కాలేదు”

“దానికేమి లెండి. సదభిప్రాయ మంటూ ఉంటే తీసుకు వెళ్లా వచ్చు చదువు చెప్పించుకోనూ వచ్చు.”

“ముఖ్యమయిన సంగతి ఆమె అటే రూపసి కాదని గూడా నా అభ్యంతరం”

పద్మనాభరావు చిరునవ్వు నవ్వాడు.

“అంతకన్న ముఖ్యమయిన విషయం ఏమిటంటే ఆమెను నేను వివాహంలో ఒక్కసారిచూశాను. పర్యాయతీ ఎన్నడూ సరిగా చూడలేదు. అదికారణంగా ఆమెను ప్రేమించ డానికి సావకాశం కలుగలేదు. ఇహ నేను ఆమెను ప్రేమించడ మనేది సంభవించదు. నా ఆశయాలకు తగిన భార్య ఆమె కానేరదు.”

“ఇవేవీ తగిన కారణాలుగా నాకు కనబడడం లేదు. మీరు చెప్పింది మీ ఊహే కదూ”

“ఏమైనా నామనస్సు తదనుకూలమైన ఆలోచనలకు అవకాశ మివ్వడం లేదు. ఈ విషయంలో నా అభిప్రాయం నిశ్చితాభిప్రాయమే.”

## ౨

పద్మనాభరావు దిగాలపడి ఆగాగే నుంచున్నాడు. రమణరావు మెల్లగా తప్పుకున్నాడు. కొంత సేపటికి పద్మనాభరావు ఇంటిదారి పట్టాడు. దారిపొడుగునా అతనికి బావగారి చర్యను గురించే ఆలోచన.

భోజనాలయిందాకా అతను మనస్సు బిగబట్టుకోవడానికి బ్రహ్మ ప్రయత్నం చేశాడు. తరువాత తల్లీ, తండ్రీ మాత్రం ఉండగా ఈవిషయం సవిస్తరంగా జరిగిందంతా చెప్మాడు. వాళ్లిద్దరూ నిలువునా నీరైనారు.

కాలణాలను గురించి తర్జుమాజరిగింది. ఏవిధంగానైనా రమణరావు భార్యను ఏలుకోడానికి సావకాశమున్నదా అని ఆలోచించారు. ఇదివరకు రమణరావు తల్లి దండ్రులు చెప్పే చాచివేత మాటలకు అర్థం ఇప్పుడు వాళ్లకు బాగా

తలసంది. ఇందుకుగాను చేయవలసిం దేమిటని తేఁలు తలలు బట్టుకున్నారు.

"ఈ విషయం సుశీలకు ఏదో విధంగా తెలియపర్చక తప్పదు. భర్త తనను ఏలడని తెలిసి ఆమె ఖేదించక తప్పదు. ఏదో వ్యాపకాన ఉంటేనే తప్ప ఈ దుఃఖము ఉపశమించదు. కనుక అమ్మాయిని ఇంగ్లీషు చదివించడం అవసరం. అది మనకు రెండు విధాలా ఉపయోగించ వచ్చు. ఇప్పటికి దానికున్న జ్ఞానాన్ని పట్టి ఒక ఏడాది తంటాలు పడితే కాశీ విశ్వ విద్యాలయం ప్రవేశ పరీక్షకు వెళ్లవచ్చు. తరువాత మదరాసులో క్వీనుమేరీసు కాలే జీలో చేరవచ్చు" అని పద్మనాభరావు తన అభిప్రా యం విశదపర్చాడు. ఈ విషయం యావత్తూ ఏదో విధంగా కూతురికి తెలియపర్చడము తల్లి తనమీద వేసు కున్నది.

## 3

రమణరావు ఉద్యోగంలో ప్రవేశించి మూడేళ్లు కావ చ్చింది. అసిస్టెంటు లెక్చెరరు అయినాడు.

ఈ మూడు సంవత్సరములలోనూ అతను సుశీలను గురించి ఆలోచించనే లేదు.

రేడియో పాట వినడానికైతే నేం, నలుగురూ పచ్చ పచ్చగా షికార్లు చేస్తూంటే చూడడానికైతేనేం రమణ రావు ప్రతిరోజూ బీచికి వెళ్లేవాడు. వెళ్లబోయే ముందు మాత్రం శ్రావణ మంగళవారపు ముత్తైదువ చేసే టంత హంగామా తప్పకుండా చేసేవాడు ముస్తాబు కావ డంలో.

చాలా దినాలనుంచీ అతనికి బీచికి వస్తూనో, బీచి దగ్గరనో ప్రతిరోజూ ఒక అమ్మాయి కనపడేది. ఆ అమ్మాయిని చూసినప్పటి నుంచీ అతనికి పరిచయమయిన ముఖంగా ఉండేది. కాని పరకాయించి చూస్తే తను ఎగిరి ఉన్న ముఖంగా తేలేదిగాదు. చూచి చూచి ఎరగని ముఖమని తెల్చుకున్నాడు.

ఆ అమ్మాయిలో నవనాగరికత ఉట్టి పడుతూంది. చాయ ఆటే పసిమి కాక పోయినా ముఖము కళకళ లాడుతూ ఉంది. దానికి తోడు ఆపక్క పాపట, ఆ పమిటపిన్ను, ఆ జారుజడ, ఆ స్నో రాసిన ముఖమూ ఆమె అందాన్ని ఇనుమడింప జేసినవి. ఆమెలో ఉన్న గాంభీర్యం, కళ అతన్ని ఆకర్షించినయి.

రమణరావు ఆ అమ్మాయిని ఏదో సాకు పెట్టి పలక రింతామని చాలా సార్లు చూశాడుగాని చొరవ చేయలేక పోయినాడు.



అతనికి రోజూ ఆమెకోసం నిరీక్షించడం అలవాటయింది. కలుసుకున్నప్పుడు మాత్రం ఆమెకోసం కాచుకొని ఉన్నవాడు లాగా కనపడేవాడు గాదు.

ఒకనాడు యథాప్రకారం ఆమె స్నేహితురాండ్రతో ముందు నడుస్తున్నది. అతను వెనుకగా వారి మాటలు, నవ్వులు, వేళాకోళాలు ఆలకిస్తూ నడుస్తున్నాడు. ఇంతలో వాళ్లకు వెనుకగా ఒకమోటారు, ముందుగా ఒక మోటారు ఒక్కసారి కూతవేసి దగ్గరకు వచ్చినయి. వాళ్లు ఏమరుపాటుగా నడుస్తున్నారేమో గాభరాపడి అటూ ఇటూ పరుగెత్తారు. ఒక మోటారు ఆ అమ్మాయి మీదికే వచ్చింది. ఆమె ఒక పెద్ద కేకవేసి అవతలికి దూకింది. దూకడంలో కాలు జారి పడ్డది. ఆమె స్నేహితులు ఇద్దరూ దగ్గరకువచ్చి లేవదీశారు. రమణరావు కూడా సహాయపడి రెండు సోడాలు తెచ్చి నొప్పిగా ఉన్న చోట పోయమని, త్రాగడానికి కలరు తెచ్చిపెట్టి, సేద తీరింతర్వాత ఒక టాక్సీని పిలిచి దానిమీద వాళ్లు ఇంటికి వెళ్లడానికి ఏర్పాటు చేశాడు. ఆమె స్నేహితురాళ్లు ఆయనకు కృతజ్ఞత చెప్పి వెళ్లి పోయినారు.

వాళ్లు టాక్సీవాడికి చెప్పే అడ్రెసు విన్నాడు రమణరావు. ఆ యింటికి వెళ్లి ఆమె ఆరోగ్యాన్ని గురించి కనుక్కుందామని అనుకున్నాడు గాని భయపడ్డాడు. మరివారం రోజులకు గాని ఆమె అతనికి కనపడలేదు. కనబడగానే ఆమె మందహాసం చేసింది. అతను తిరుగా మందహాసంతో ఆహ్వానించి

“కులాసాగా ఉన్నారా ? మీ విషయం ఏలా తెలుస్తుందా అనుకుంటున్నాను.”

“చాలా సహాయం చేశారు.

“అది అంత చెప్పుకో తగ్గదికాదు లెండి.

మాట్లాడడానికి తగిన విషయాలు లేక సంభాషణ ఆగి పోయింది. మాట్లాడకుండా ఇద్దరూ బీచికి చేరారు. వెళ్లి పోతూ అతను

“మీ పేరు అడుగుతున్నందుకు క్షమించాలి”

“శాంత”

“ఏం చదువుతున్నారు ?

“క్వీను మేరీసులో ఇంటరు చదువుతున్నాను

మళ్లీ కొంతసేపు సంభాషణ ఆగిం తర్వాత అతను

“తమ పరిచయ భాగ్యం కలిగినందుకు చాలా సంతోషం. వెళ్లివస్తాను” అన్నాడు.

ఆమె చిరునవ్వుతో వెళ్లింది.

అది మొదలుగా వాళ్లిద్దరూ తప్పకుండా ప్రతిరోజూ కలుసుకునేవారు. పరిచయం స్నేహంగా మారింది. షికారయిం తర్వాత ఆమెను ఇంటిగేటు దాకా పంపి వెళ్లిపోయేవాడు అతను.

కొన్నిరోజులు గడిచినవి. శాంత తన జీవితంలో మాధుర్యం కల్పించేదనీ, ఆమెలేని జీవితం తనకు లేదనీ రమణరావు నిశ్చయించుకున్నాడు. ఆమెకు తన కోరిక వెల్లడించి ఆమె సమ్మతి గ్రహించడమే తరవాయి అని వూహించాడు.

అతను ఒకరోజు తన అభిప్రాయం వెల్లడించాడు. ఆమె ఉత్సాహాన్ని కనబఱచక తాను అస్వతంత్రురాలననీ, తల్లిదండ్రుల ఆజ్ఞప్రకారము నడవ వలసినదాననని చెప్పింది. అంతటితో ఆ ప్రస్తావన ముగిసింది నాటికి.

కాని ఎల్లప్పుడూ అతనికి ఆమెను గురించే ఆలోచన. ఆమె తనకు సహచారిణి కాకపోతే తన జీవితంలో సౌఖ్యం లేదనీ, జీవితమే అవసరం లేదనీ అనే వెఱ్ఱి స్థితిలోకి దిగాడు.

చివరకు ఒకసారి ఆమెకా విషయము తెలియజేశాడు కూడాను. అయితే ఆమే ఏమీ సమాధానం చెప్పలేదు.

రమణరావుకు ఉత్తరం వచ్చింది. మదరాసు ముద్ర చూసేసరికి అతనికి ఒక విధమయిన ఆశకలిగింది. గబగబా ఉత్తరం చింపినాడు. అందులో

అయ్యా

ట్రిప్లికేన్
మదరాసు

నేను మిమ్మలను స్నేహితునిగా తప్ప మరొక విధముగా ప్రేమించ జాలను. మీకు ముఖతః ఈ సహాధా

నము చెప్పి మీమనసు డానికి ఇష్టపడక మీకీ ఉత్తరం వ్రాస్తున్నాను.

ఇట్లు
మీ స్నేహితురాలు
శాంత

ఉత్తరం చదివి నిర్ఘాంత పోయినాడు. తనను ఆమె మోసగించిందని కోపం వచ్చింది. గుప్పున కూలిపోయినాడు. ఆమె తనతో చేసిన స్నేహాన్ని తను అపార్థం చేసుకున్నట్టా లేక ఆమె తనను మోసగించిందా అనే ఆలోచన తెగలేదు. ఏమయినా సరే ఆమెతో స్వయంగా మాట్లాడి విషయం తేల్చుకో వలసిందే నని వెంటనే బయలుదేరి ఆమె యింటికి వెళ్లాడు.

శాంత ఇంట్లోనే ఉన్నదని సమాధానం వచ్చింది. అతను ఒక గదిలో కూర్చుండగా ఆమె వచ్చింది. అతని మొగం కో కత్తివేసినా నెత్తురు చుక్కలేదు. ఉత్తరం చేతిలో కెంచుకొని

"ఈ ఉత్తరం నీవు వ్రాసిందేనా శాంతా?" అన్నాడు.

"అవును. నాదస్కతే వుంది."

"ఉన్నది. కాని నేనిలాంటి ఉత్తరం వస్తుందని కలలోనైనా ఊహించలేదు."

"మరోవిధంగా ఊహించడానికి తమ కెన్నడూ అవకాశం కలిగించలేదు నేను."

"ఇది నీఆఖరి జవాబేనా?"

ఆమె అవునని తల ఊగించింది.

"పోనీ నిన్ను తిరిగీ కోరుతున్నాను. నీ అభిప్రాయం మార్చుకొని నన్ను ధన్యుణ్ణి చెయ్యి"

"క్షమించండి. నేను మిమ్మా విధంగా ఎన్నడూ ప్రేమించ లేదు"

"మరి ప్రేమించక పోవడానికి కారణం?"

"ఏమి కారణం చెప్పను చెప్పండి"

"ఉంటే చెప్పు"

"మీకు కోపం వస్తుందేమో?"

"ఏమీరాదు. తప్పకుండా చెప్పాలి"

"మీ సౌందర్యాన్ని గురించి అంత మంచి అభిప్రాయం లేనందుకు క్షమించండి."

రమణరావు చాలాసేపు మాట్లాడలేదు. అతని మనస్సు పెద్ద దెబ్బతిన్నది. చివరకు.

"అంతేనా? ఇక నేను వెళ్లవచ్చునా?" అన్నాడు అతను.

"సెలవు పుచ్చుకుంటాను" అని శాంత లోపలికి వెళ్లింది.

ఆమెమాట, ఆమె గాంభీర్యం అతన్ని మరీ కదిలించి వేసినయి.

అతను బేజారై పోయిన ముఖంతో వసారాలోకి వచ్చేసరికి అక్కడ పద్మనాభరావు కుర్చీలో కూర్చొని పత్రిక చదువుకుంటున్నాడు. పద్మనాభరావు అలాంటి సమయంలో అతనికి కనబడడం వల్ల అతను మరీ గాభరా పడ్డాడు. అతను అచటికి ఎందుకు వచ్చిందీ తెలియలేదు.

రమణరావు పెద్ద ప్రయత్నంతో "ఇదేమిటోయ్ నీవిక్కడ ఉన్నావు?" అన్నాడు.

"ఇక్కడే ఉంటున్నాను. లాకాలేజీలో చేరాను."

"ఏమిటీ ఎక్కడా కనపడడంలేదే? ఈ ఏడే చేరావా?"

"అవును"

"బస ఎక్కడ"

"ఇక్కడనే"

"ఈ యింట్లో ఒక గది తీసుకున్నావా"

"కాపరంగానే ఉంటున్నా"

"ఎవ రెవరూ"

"నేనూ మాచెల్లీ"

"అవతల భాగంలోనా?"

"కాదు ఈ భాగంలోనే"

అతని మనస్సులో ఒక సినిమా ఫిల్ము తిరిగినట్లయింది. అతను కుర్చీలో కూలబడి

"ఇప్పుడు నేను మాట్లాడింది ఎవరితోనూ ?

"నా చెల్లెలుతో" ఒక పెద్ద నవ్వు నవ్వాడు. రమణారావు మనసులో ఎంత పరాభవం పొందుతున్నా, కొంతసేపటికి "కాస్త అభిప్రాయం మార్చుకోమందు.


"ఏమోనబ్బా ! నీ సౌందర్యాన్ని గురించి ఆవిడ అభిప్రాయం సులభంగా మారేది కాదనుకుంటాను"

* * * *

"అయితే ఏమి చేయమంటావు"

"లోపలికి పోయి ఆమెనే కనుక్కోవోయ్"

* * * *



మర్నాటి నుంచి బీచి రోడ్డునా చెట్టాపట్టాలు పట్టుకొని తిరుగుతూ వుండేవాళ్లు రమణరావూ—సుశీలా.

---

ప్రశస్తమయిన

లేసు వేసిన ధోవతులు, మధుర ఉత్తరీయములు

కేశవరాం అండ్ కంపెని

1/287, ఎస్ప్లనేడ్ రోడ్డు, మదరాసు

మంచి సరకు వెల సరసము

చిరకాలమునుండి [illegible] చున్న మూత్ర వ్యాధులకును శగ (గనేరియా) వ్యాధికిని క్రొత్తగా కనిపెట్టబడిన దివ్యౌషధము

గోనో కిల్లర్ (రిజిస్టరుడు)

GONO KILLER ORIGINAL REGD TRADE MARK

కృత్రిమములకు జాగ్రత్త "కోడి మార్కు"ను చూసి కొనుడు

ఈ ఔషధము ఇంగ్లీషు మందులను దేశీయ ఔషధములను పుచ్చుకొనినను గుణము కలుగనియెడలను, యింజక్షనులవలనను, వాక్సినులవలనను గూడ లాభములేక పోయినయెడల, కడపటి ప్రయత్నముగా మా గోనోకిల్లరును గూడ పుచ్చుకొని చూడుడు. పెక్కుయేండ్లనుండియున్నను లేక క్రొత్తగా కలిగినను ఏరకము శగ సంకటమైనను మరెట్టి మూత్రవ్యాధులనైనను స్త్రీలకైనను పురుషులకైనను గోనోకిల్లరు తప్పక కుదుర్చును. మూత్రము ఝూరీగా వెడలును. మూత్రము పోవుచున్నపుడు కలుగు మంట తగ్గిపోవును. మూత్రనాళమునందలి వాపు తీసిపోవును. శగవ్యాధి (గోనోకోకసు) వలన మూత్రము బొట్టుగా పడుట, మేహరోగమువలన మూత్రద్వారమునుండి పోవు తెలుపు, మూత్ర ద్వారముయొక్క వాపు, మూత్రద్వారముయొక్క చుట్టు వుండు పోకయొక్క వాపు, మూత్రాశయముయొక్క వాపు లేక మూత్రతిత్తియొక్క వాపు, నరముల జబ్బు మున్నగు వ్యాధులన్నియును స్త్రీలకును పురుషులకునుగూడ గోనోకిల్లరువలన కుదురును. వీర్యము (సెమను) పోవుట, మూత్రవ్యాధులు మున్నగునవిగూడ దీనివలన కుదురును. ఖరీదు 50 మాత్రలుగల సీసా రు. 3—0—0. కృత్రిమములు చూచి భ్రమజెందవలదు. మా పుంజుమార్కు గమనింపుడు. వి. పి. చార్జి ప్రత్యేకము

అడ్రెసు :—డాక్టరు డి. యన్. జస్సాని

గిర్గాను వెనుకరోడ్డు, బొంబాయి 4

Dr. D N. JASANI, Girgaum Back Road, Bombay 4

Madras Agents.—DADHA & CO,

Naіniappa Naick St, P T. Madras